ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 11 ఆగస్టు 2024






అమ్మో.. అబార్షన్

పిండ దశలోనే జననాలను అడ్డుకుంటున్నారు. జననాలను బలవంతంగా అడ్డుకోవడాన్ని భ్రూణహత్యలుగా పరిగణిస్తున్నారు.. కానీ వీటిని అత్యంత దారుణంగా చేసేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే అబార్షన్ చేయాలి. కానీ జరుగుతున్న వాటిని చూస్తే ఆందోళనకరంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన శాతానికి మించి గుంటూరు జిల్లాలో గత ఏడాది అబార్షన్లు జరిగినట్లు సమాచారం. గత ఏడాది జిల్లాలో గర్భం దాల్చిన వారిలో 9 శాతం అబార్షన్లు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా తెలుసుకోవచ్చు. ఈ అబార్షన్లీ కూడా స్కానింగ్ సెంటర్లు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల పరిధిలోనే జరిగాయని తెలుస్తోంది. అబార్షన్లపై ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని తీసుకొచ్చినా ఫలితం లేదని జరిగిన కేసులను బట్టి అర్థమవుతుంది. ఈ చట్టం అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా ఉండగా.. వైద్యులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. పుట్టబోయేది ఆడా.. మగా అన్న విషయం స్పష్టంగా తెలిసే సమయంలోనే ఎక్కువగా గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది.

- పెరిగిపోతున్న గర్భవిచ్ఛిత్తి
- గత ఏడాది గుంటూరు జిల్లాలో 1789 కేసులు
- స్కానింగ్ సెంటర్లు ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువ
- ఆందోళన కలిగిస్తున్న వైద్యఆరోగ్యశాఖ నివేదికలు
- డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన శాతానికి మించి అబార్షన్లు

గుంటూరు సిటీ, ఆగస్టు 10: నేషనల్ హెల్త్ మిషన్ గర్భిణుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి అనేక పథకాలు ప్రవేశపెట్టినా అబార్షన్లు ఆగడం లేదు. వందలకొద్దీ ప్రాణాలు పిండ దశలోనే గాలిలో కలిసి పోతున్నాయి. పుట్టబోయేది ఆడా.. మగా అన్న విషయం స్పష్టంగా తెలిసే సమయంలోనే ఎక్కువగా గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో అబార్షన్లు (గర్భవిచ్ఛిత్తి) అధికంగా ఉన్నట్టు అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ అబార్షన్లు జరుగుతుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2024-2025 సంవత్సరానికి గాను (2024కు ముందు గర్భిణీగా నమోదై ప్రసవం కాని వారు కూడా ఈ లెక్కలోకి వస్తారు) జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల మంది గర్భం దాల్చగా... అందులో 1,789 మందికి అబార్షన్ అయినట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన శాతానికి మించి అబార్షన్లు జరిగినట్లు సమాచారం. గుంటూరు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ అబార్షన్లు జరిగినట్లు వైద్య శాఖ నివేదిక చెబుతోంది. ఆయా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన గర్భాలలో 10 శాతం నుంచి 15 శాతం మేర అబార్షన్లు జరిగాయి. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మున్నంగిలో అధికంగా 16.8శాతం, ఫిరంగిపురంలో 14, నుదురుపాడులో 13.3, మన్నవలో 13.4 శాతం అబార్షన్లు నమోదయ్యాయి. ఈ కేంద్రాలన్నీ స్కానింగ్ సెంటర్లు ఎక్కువగా ఉన్న గుంటూరుకు సమీపంలోనే ఉన్నాయి. ఎలాంటి దురుద్దేశాలు లేకుండానే ఎక్కువ అబార్షన్లు జరుగుతున్నా దానికి వైద్య, ఆరోగ్యశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన మొదటి నెల నుంచే సదరు గర్భిణీకి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని నేషనల్ హెల్త్ మిషన్ చెబుతోంది. అందులో భాగంగానే రాష్ట్రానికి ఏటా వందల కోట్ల నిధులు కేటాయిస్తోంది. అయినా అబార్షన్లు పెరుగుతుండడం.. గర్భిణులకు అందిస్తున్న సేవల్లో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతోంది.



లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యం..?

నగరం, పట్టణాల పరిధిలోని చాలా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యమైనట్లు కనిపిస్తోంది. సెంటర్లకు వచ్చిన వారిని సంతృప్తి పరిచేందుకు పుట్టబోయేది అబ్బాయా.. అమ్మాయా.. అనే విషయాన్ని ముందుగానే వెల్లడిస్తున్నారు. కొంతమంది వైద్యులు కూడా ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పీసీపీఎన్ డీటీ యాక్టు ఉన్నా భ్రూణహత్యలు జరుగుతున్నట్లు రుజువవుతోంది. కలెక్టర్ ఆదేశాలతో వైద్య, ఆరోగ్య శాఖ స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నా అవి తూతూ మంత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కార్యాలయంలోని కొందరు అధికారులు ఈ విషయంలో స్కానింగ్ సెంటర్లకు, అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తెనాలి ప్రాంతంలో ఎక్కువగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్ట్ వెల్లడి చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.



పొలాల కౌలుకు.. పోటాపోటీ

గణనీయంగా ధరల పెరుగుదల

- వరి ఎకరాకు 10 నుంచి 14 బస్తాలు
- మిరప భూములకు గరిష్ఠంగా రూ.40 వేలు
- ఒప్పందాలు పూర్తి.. సాగు పనుల్లో కౌలు రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ ఉప్పొంగగా సాగర్ జలాశయం నిండింది. కుడి కాల్వకు నీటిని పుష్కలంగా సరఫరా చేస్తున్నారు. 15 రోజుల్లో సాగర్ ఆయకట్టు సాగు చిత్రం పూర్తిగా మారిపోయింది. ఇటీవల వరకు సాగుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు కొన్ని రోజులుగా సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ముమ్మరంగా సాగు పనులు సాగుతున్నాయి. ఇదే సమయంలో కౌలు రైతులు పొలాలను కౌలుకు తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. దీంతో గత ఐదేళ్లుగా లేనివిధంగా కౌలు ధరలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు గరిష్ఠంగా కౌలు 14 బస్తాలు పలుకుతున్నది. ఏటా పత్తి సాగు చేసే పొలాల్లో అనుకూలమైన వాటిలో ఏడాది వరి సాగుకు సిద్ధమయ్యారు. దీంతో ఈ ఏడాది భూ యజమానులకు లబ్ధి చేకూరేలా కౌలు ధరలు ఉన్నాయి. ఇప్పటికే కౌలు ఒప్పందాలు పూర్తి చేసుకుని కౌలు రైతులు సాగు పనులు చేపట్టారు. సాగర్ ఆయకట్టులో 2019 నుంచి కౌలు పరిశీలిస్తే ఈ ఏడాదే అధికంగా ఉందని అర్థమవుతోంది. కొన్నేళ్లుగా వరి సాగుకు రైతులు ఆసక్తి చూపలేదు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది వరకు ఎకరా కౌలు రెండు నుంచి 5 బస్తాల వరకు మాత్రమే ఉంది. వరి సాగు చేయక 2020, 2021 సంవత్సరాల్లో వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. ఈ ఏడాది ఆ పరిస్థితి నుంచి భూ యజమానులు గట్టెక్కారు. ఈ ఏడాది ముందుగా సాగర్ కాల్వకు నీరు విడుదలతో వరి సాగు వైపు కౌలు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కౌలు ధరలు పెరిగాయి. వరి సాగుకు ఎకరాకు కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 12 బస్తాలు, మరి కొన్ని ప్రాంతాల్లో 12 నుంచి 14 బస్తాల వరకు కౌలు ఒప్పందాలు జరిగాయి. వరి సాధారణ విస్తీర్ణం 1.05 లక్షలు. కాగా నీరు పుష్కలంగా సరఫరా అవుతుండటంతో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా.

గత ఏడాది కంటే పెరిగిన మిర్చి కౌలు

ఆయకట్టులో మిరప సాగు చేసే పొలాలకు గత ఏడాది కంటే ఈ ఏడాది కౌలు పెరిగింది. గత ఏడాది సాగు నీరు లేక పోవడంతో వర్షాధారంపై మిరప సాగు చేశారు. ట్యాంకర్ల ద్వారా మిరపకు తడులు ఇవ్వాల్సి రావడంతో నీటి ఖర్చు అధికమైంది. ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదని మిర్చి సాగుకు కౌలు ఒప్పందాలకు రైతులు పోటీ పడ్డారు. నీటి వసతి ఉన్న పొలాల్లో మిరప సాగుకు కౌలు డిమాండ్ ఉంది. ఎకరాకు కొన్ని ప్రాంతాల్లో రూ.30 నుంచి 35 వేలు, వరి కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.40 వేల వరకు కౌలు ధర పలికింది. 2022లో 1,39,922 ఎకరాల్లో 2023లో 1,25,881 ఎకరా ల్లో మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని తెలుస్తోంది.


నారు కోసం వరి విత్తనాలు చల్లిన పొలం

పత్తి సాగుకు అంతంతే..

వరి, మిరప సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో పత్తి పొలాలకు కౌలు అంతంత మాత్రంగానే ఉంది. వరుసగా నాలుగేళ్ల పత్తి సాగు చేసిన రైతులు దారుణంగా నష్టపోయారు. అధిక వర్షాలు, గులాబి పురుగు, వైరస్ తెగుళ్లతో పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. పత్తి పంట దెబ్బ తినడంతో సాగు నగంలోనే పత్తి పీకేసి మొక్కజొన్న సాగు చేశారు. దీంతో ఈ ఖరీఫ్‌లో పత్తి సాగుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కూడా పత్తి సాగు తగ్గు తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. జిల్లాలో గత ఏడాది పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 3,04,052 ఎక రాలు కాగా ఈ ఏడాది అది 2,67,965 ఎకరాలకు వ్యవసాయ శాఖ తగ్గించింది. అయితే ఇంత కన్నా తక్కువగానే పత్తి సాగ య్యే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటి వరకు 92,240 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేసి నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.


వరి నారు సాగు పొలం దమ్ము

కౌలు రైతులకు కార్డులు అందేనా?

ఈ ఏడాది కౌలు రైతుల సంఖ్య పెరగను న్నది. అయితే కౌలు రైతులకు సకాలంలో కార్డులు అందించే విషయంలో ప్రభుత్వ చర్యలు నామమా త్రంగానే ఉన్నాయి. 65 వేల మంది కౌలు రైతులకు కార్డులు పంపిణీ లక్ష్యం అని వ్యవ సాయ శాఖ వెల్లడించింది. అయితే లక్ష్యం మేర కార్డులు అందించేం దుకు క్షేత్ర స్థాయిలో అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు న్నాయి. సాగుకు బ్యాంకు రుణం కోసం కూడా కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు.



చెత్తశుద్ధిలో.. అవినీతి కంపు

- స్వచ్ఛాంధ్ర ముసుగులో కోట్ల దోపిడీ
- రీసైక్లింగ్ పేరిట నకిలీ బిల్లుల సృష్టి
- మంగళగిరి, తాడేపల్లిలో భారీ కుంభకోణం
- కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు
- వెలుగులోకి వస్తున్న గత ప్రభుత్వ అక్రమాలు



మంగళగిరి, ఆగస్టు 10: మున్సిపల్ కేంద్రాల్లో అటు ప్రజలు ఇటు అధికారులకు ప్రధాన సమస్య చెత్తశుద్ధి. వీధుల్లో పేరుకుపోయే చెత్త నిల్వలతో అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. అలాగే ఆ చెత్తాచెదారాల తొలగింపు మున్సిపాల్టీలకు ప్రధాన సమస్య. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో మాత్రం ఈ చెత్తశుద్ధితోనే రూ.కోట్లు కొట్టేశారు. వైసీపీ హయాం లో పాలకవర్గం లేకపోవడాన్ని అవకాశంగా తీసుకుని చెత్తను శుద్ధి చేసే పనుల్లో చిత్తశుద్ధిని పక్కనపెట్టి కుంభకోణానికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఈ అవినీతి భాగోతాన్ని నడిపించినట్టు విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో ఘనేశ్వర, ఆకాంక్ష, అవినాష్, తరుణి, సృష్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో చెత్తశుద్ధి పనులను చేపట్టాయి. చెత్తను ఆరబెట్టి, ఎండబెట్టి, పొడి చెత్తను ట్రోమాల్ మిషన్‌లో వేసి రీసైక్లింగ్ చేసి జిందాల్ ప్లాంటుకు తరలించాలి. కానీ, అవేవీ చేయకుండానే పనులు చేసినట్టుగా రికా ర్డుల్లో చూపించి నకిలీ బిల్లులను సృష్టించి నిధులు దోచేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు కుమ్మక్కై బలవంతంగా ఫీల్డ్ కో ఆర్డినేటర్లతో పనులు పూర్తయినట్టుగా సంతకాలు పెట్టించినట్టు సమాచారం. ఏపీ అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజరు రఘు నాథరెడ్డి ఈ ఏడాది మేలో రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్‌తో పాటు మరో 8 మంది సిబ్బంది రాజీనామాలు చేయడం చూస్తుంటే చెత్త రీసైక్లింగ్ పనుల్లో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలకు 2022 లో స్వచ్ఛాంధ్ర కార్పొ రేషన్ ఆధ్వర్యంలో విడివిడిగా టెండర్లను పిలిచారు. తాడేపల్లి పరిధిలోని ఎయిమ్స్ రోడ్డు కొలనుకొండ డంపింగ్ యార్డు, మంగళగిరి నిడ మర్రు రైల్వే గేటు వద్ద చెత్త రీసైక్లింగ్ బయో మైనింగ్‌కు ఘనేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెండర్లు దక్కించుకుని 2022 ఆఖర్లో పనులను ప్రారంభించింది. మంగళగిరి డంపింగ్ యార్డులో లక్షా 33 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగతా చెత్తను కొలనుకొండ వద్ద శర్వాణీ రెడీమిక్స్ ఎదుట ఉన్న 40 అడుగుల లోతు గుంతల్లో పోశా రు. తాడేపల్లి కొలనుకొండ డంపింగ్ యార్డులో 95 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 20 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగిలిన చెత్తతో డంపింగ్ యార్డు ప్రాంతంలో పక్కనే ఉన్న గుంతలు, చెరువును పూడ్చివేసి చేతులు దులుపుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, ఫీల్డ్ కోఆర్డి నేటర్లు జరుగుతున్న అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి ... మున్సిపల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు మిన్నకుండి పోయారనే ఆరోపణలున్నాయి. రీసైక్లింగ్ అనంతరం ఎన్ని లారీల్లో చెత్తను గుంటూరులోని జిందాల్ ప్లాంటుకు తరలించారో సరైన సమాచారం లేదు. వంద శాతం పనులను పూర్తిచేసినట్లు చూపించి బిల్లులను రాబట్టుకున్నారు. కాంట్రాక్టర్లు, అధికార యంత్రాంగం, వైసీపీ ప్రజాప్రతినిధుల కుమ్మక్కై చేసిన ఈ చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ కుంభకోణంలో సుమారు రూ.9 కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ దోపిడీలో ఓ ఇంజనీరింగ్ అధికారికి రూ.20 లక్షలు ముట్టినట్టుగా సమాచారం. అప్పటి పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రెటరి శ్రీలక్ష్మీ ప్రమేయంతోపాటు మంగళగిరి మాజీ ఎమ్మెల్యే బంధువు అనధికార పార్టనర్‌గా వ్యవహరించినట్లు తెలి సింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించి పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంటీఎంసీలో విజిలెన్స్ విచారణ?

- గత ఐదేళ్ల అభివృద్ధి పనుల ఫైళ్లు స్వాధీనం

మంగళగిరి: వైసీపీ పాలనలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయానికి విజిలెన్స్ అధికారుల బృందం చేరుకుని అనేక ఫైళ్లను తీసుకువెళ్లినట్టు తెలిసింది. గత 2019 నుంచి 2024 ఎన్నికల వరకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను విజిలెన్స్ బృందం పరిశీలించనుంది. ఐదేళ్లు పాలకవర్గం లేకపోవడంతో అప్పటి వైసీపీ ముఖ్యనేత ఏకఛత్రాధిపత్యం చెలాయించారు. అప్పట్లో అభివృద్ధి పనులకు విపరీతమైన అంచనాలు వేయించడంతోపాటు టెండర్లు లేకుండా పనులను జరిపించడం, పనులు పూర్తయ్యాక మొక్కుబడిగా టెండర్లను పిలవడం వంటి అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ప్రైవేటు కాంట్రాక్టర్లచే టెండర్లపై చేయించాల్సిన పనులను సైతం మున్సిపల్ శానిటరీ వర్కర్లతో జరిపించి ఆ సొమ్ములను కూడా జేబుల్లో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని నిగ్గు తేల్చేందుకు కొత్త ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

విద్యాదాత కుప్పుస్వామి

- విద్యాదానం గొప్పదని నిరూపించారు
- విగ్రహావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పర్చూరు, ఆగస్టు 10: అన్నదానం కన్నా.. విద్యాదానం గొప్పదని నిరూపించిన మహనీయుడు జాగర్లమూడి కుప్పుస్వామి అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. విద్యాదాత, రాజకీయవేత్త, స్వర్గీయ కుప్పుస్వామి కాంస్య విగ్రహ ఆవిష్కరణ బాపట్ల జిల్లా కారంచేడులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు పల్లెలు వైపు చూడని సమయంలో కుప్పుస్వామి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నతులన్నారు. పదవి పదిమంది మేలు కోసమని, తోటివారికి సాయపడడమే జీవిత పరమార్థమని నమ్మి నిరూపించిన వ్యక్తి కుప్పుస్వామి అని కొనియాడారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కారంచేడు ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన వ్యక్తి కుప్పుస్వామి అని తెలిపారు. తెలుగుభాష, ఆలయాల పునరుద్ధరణ, కవిగా, విద్యాదాతగా కుప్పుస్వామి ఎన్నో సేవలందించారన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ కుప్పుస్వామి సేవలు చిరస్మరణీయమని, విద్యాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషిచేశారన్నారు. ఇలాంటి వ్యక్తులు బావితరాలకు దిక్సూచి వంటి వారని కొనియాడారు. కుప్పుస్వామి సేవలను కుటుంబ సభ్యులు నేటికీ కొనసాగించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకుడు బండారుపల్లి హేమంత్‌కుమార్‌తో పాటు జాగర్లమూడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం దగ్గుబాటి దంపతుల ఆహ్వానం మేరకు వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే ఏలూరి వారి నివాసానికి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు.


కుప్పుస్వామి విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు, పురందేశ్వరి, కామినేని, వెంకటేశ్వరరావు, ఏలూరి

బాలల హక్కులను పరిరక్షిద్దాం

- బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో వక్తలు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బాలలపై దాడులు జరగడం అవాంఛనీయం. వారి హక్కుల పరిరక్షణకు అందరూ నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలి. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. లైంగిక దాడుల్లో ఎక్కువగా తెలిసిన వారి వలనే జరుగుతుండటం బాధాకరం.. అని బాలల హక్కుల పరిరక్షణపై జరిగిన సదస్సులో పలువురు వక్తలు తెలిపారు. ఏపీ హైకోర్టు(జువనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతుల బాలల హక్కుల పరిరక్షణపై శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేక అవసరాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి వారికి బహుమతులు అందించారు. సభలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తొలుత ప్రసంగించారు. ఎన్‌సీఆర్‌బీ రికార్డుల ప్రకారం లైంగిక దాడులు జరిగిన 1004 కేసుల్లో 900 కేసులు తెలిసిన వారి వల్ల జరిగినవేనంటూ చీఫ్ జస్టిస్ భావోద్వేగానికి లోనయ్యారు. బాలలు బలహీనులు ఏమి చేయలేరు ఎవరికి చెప్పుకోలేరు అని అనుకుని వారిపై లైంగిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. జువనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ మాట్లాడుతూ బుద్ధిహీనమైన చర్యలకు బాధితులుగా మారిన పిల్లలకు ప్రభుత్వం కల్పించిన హక్కులను పరిరక్షించడానికి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జువనైల్ జస్టిస్ కమిటీ సభ్యుడు, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు,సాంఘిక సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సెక్రటరి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలిసి ఊయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'



నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీ.జే.మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.

'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.













టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ దస్తగిరి


వైసీపీ కౌన్సిలర్ దస్తగిరిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 10: పట్టణంలోని 26వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ దస్తగిరి టీడీపీలో చేరారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గృహంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి టీడీపీ కండువా కప్పి దస్తగిరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో షేక్ మదార్‌సాహెబ్ పాల్గొన్నారు. పురపాలక సంఘ ఎన్నికల్లో పట్టణంలోని మొత్తం 31 వార్డులను వైసీపీ ఏకగ్రీవం చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి రావడంతో పదిమంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా మరో పదిమంది వైసీపీ కౌన్సిలర్లు కూడా త్వరలోనే టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య గణనీయంగా పెరిగి మున్సిపల్ చైర్మన్ సీటును కూడా కైవసం చేసుకునే దిశగా టీడీపీ పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్ పనులు

● చెదురుమదురు వర్షాలు పడుతున్నా కొనసాగుతున్న పనులు


రాజధాని అమరావతిలో కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

తుళ్లూరు, ఆగస్టు 10: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలు వర్షంలో కూడా కంపచెట్లను పీకి పారేస్తున్నాయి. క్లియరెన్స్ పనులకు ఎన్‌సీసీ కంపెనీ టెండర్‌ను దక్కించుకున్న సంగతి తెలిసిందే. 26వేల ఎకరాలలో ఈ పనులు జరగాల్సివుంది. అధికసంఖ్యలో యంత్రాలు ఇప్పటికే పనులు ముమ్మరంగా చేస్తున్నాయి. జోన్‌ల వారీగా ఎన్‌సీసీ కంపెనీ పనులు వేగవంతం చేస్తున్నది. రాజధాని అమరావతిలో ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి కోసం తట్ట మట్టి వేయలేదు. అంతేగాక రాజధానికి రైతులిచ్చిన 33వేల ఎకరాల భూములను అడవిలాగా మార్చింది. ఇప్పుడు జంగిల్ క్లియరెన్స్ కోసం ఖర్చు చేస్తున్న రూ.33.5 కోట్లు జగన్‌రెడ్డి నిర్లక్ష్యం ఫలితమేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులలో పనులు పూర్తికావాలని టెండర్ ప్రక్రియలో ఉంది. అందుకు తగ్గట్టుగా ఏజెన్సీ కంపెనీ యంత్రాలను రంగంలోకి దించుతున్నది. ఇంకా యంత్రాలు రంగంలోకి దిగుతూనే ఉన్నాయి.

16 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు

● భూ వివాదాలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం
● వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాల పైనా దృష్టి కేంద్రీకరణ
● 22ఏ భూముల స్వతంత్రతలో జరిగిన అక్రమాలపై చర్యలు



గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం తర్వాత రెవెన్యూ సదస్సులు మళ్లీ జరగబోతున్నాయి. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు గ్రామగ్రామాన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అందుకు అవసరమైన ప్రణాళికని రూపొందించుకోవాలని సూచించింది. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య లక్ష్యం. సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులతో బృందాలను నియమించి ప్రతీ రెవెన్యూ గ్రామంలో పర్యటించి ముఖ్యంగా భూ ఆక్రమణ, సెక్షన్-22ఏ తారుమారుకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తారు. ఆ అధికారే షెడ్యూల్ గ్రామ/మండల స్థాయి ఫిర్యాదుల స్వీకారం, పరిష్కారాలను ఫైనల్ చేస్తారు. అన్ని ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్ జీఆర్‌పీలో నమోదు చేస్తారు.

ఆగస్టు 15న లాంచనంగా సదస్సులను జిల్లా మంత్రి ప్రారంభిస్తారు. సదస్సులకు కో-ఆర్డినేటర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారు. సబ్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లను షెడ్యూల్ రూపొందించి ఈ నెల 13వ తేదీ లోపు తనకు నివేదించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎక్కువ విస్తీర్ణం కలిగిన గ్రామాలకు అయితే ఒక రోజంతా సదస్సుల నిర్వహణకు కేటాయిస్తారు. ఇతర గ్రామాలకు ఒక పూట కేటాయిస్తారు. సదస్సులపై ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ స్థాయి బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌వో, సర్వేయర్, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ, వక్ఫ్‌బోర్డుల నుంచి ప్రతినిధులు ఉంటారు. పోలీసు సెక్యూరిటీ కూడా ఉంటుంది. ప్రతీ మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ నియమిస్తారు.

సదస్సుకు వెళ్లేటప్పుడు గ్రామ చిత్రపటాలు, ఆర్‌వోఆర్ 1-బి/అడంగల్ పహాణి/ప్రభుత్వ భూమి కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించినవి తీసుకొని వస్తారు. ప్రతీ గ్రామంలో ఉదయం 9 గంటలకే రెవెన్యూ సదస్సుని ప్రారంభిస్తారు. పిటీషన్లకు సంబంధించి తహసీల్దార్ విచారణ, రీసర్వే, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ఏవైనా సర్వే హద్దురాళ్లపై ఎవరివైనా పేర్లు, బొమ్మలుంటే వాటిని చెరిపేయడం వంటివన్నీ చేపడతారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 22ఏ భూములు, అసైన్‌మెంట్ ల్యాండ్స్‌ని జిల్లాలో 670 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్(స్వతంత్రం) చేశారు. ఇది కచ్చితంగా వైసీపీకి చెందిన వారికి మేలు చేయడానికేనన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి బండారాన్ని కూడా సదస్సుల ద్వారా బయటపెట్టి చర్యలు తీసుకోనున్నారు. నవంబరు 15వ తేదీ కల్లా ఫిర్యాదుల పరిష్కారం కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. సదస్సుల నిర్వహణ కోసం ప్రతీ జిల్లాకు రూ.8.10 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.

ఆఫ్రికన్ వైద్యులకు మోకీలు మార్పిడిపై శిక్షణ

● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడి


అంగోలా యువ వైద్యులతో డాక్టర్ నరేంద్ర రెడ్డి


గుంటూరు (మెడికల్), ఆగస్టు 10: ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇకపై సాయి భాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆఫ్రికా దేశాల్లో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజుల పర్యటన అనంతరం శనివారం డాక్టర్ నరేంద్రరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. అంగోలా దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పౌల లుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలి రివిజన్ నీరీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నాలుగు రోజులపాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు రివిజన్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలపై శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సూచన మేరకు అక్కడి యువ వైద్యులకు గుంటూరులోని సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్లపై శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘంతో తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన ప్రకటించారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనున్నదని ఆయన తెలిపారు.

ఏఎన్‌యూ బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా డాక్టర్ వెంకట శివలక్ష్మి


డాక్టర్ వెంకట శివలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 10: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ చైర్మన్‌గా ఆర్‌వీఆర్ విద్యా కళాశాల లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. గత 22 సంవత్సరాలుగా ఫిజిక్స్ లెక్చరర్‌గా బోధనారంగంలో రాణించారు. ప్రస్తుతం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నారు. ఎంఈడీ థీసెస్‌లో 10 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. గతంలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో బీఈడీ ప్రశ్నాపత్రాల రూపకల్పనలోనూ తన వంతు పాత్ర పోషించారు. బీఈడీకి సంబంధించిన పలు పుస్తకాలకు రచయితగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శివలక్ష్మి మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో మెరుగైన విద్యా విధానానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన టీడీపీ ప్రజాప్రతినిధులకు, ఏఎన్‌యూ అధికారులకు శివలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా తన వంతు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ శివలక్ష్మి నియామకం పట్ల బీఈడీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మాచర్ల రూరల్, ఆగస్టు 10: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా ప్రాజెక్ట్ అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. 16 క్రస్ట్‌గేట్లను 10 అడుగులు, 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3597 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,12,756, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,55,549 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,55,549 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రైలు ఎక్కబోతూ జారిపడి బీటెక్ విద్యార్థి మృతి


కొల్లి హర్షవర్ధన్ (ఫైల్)

దాచేపల్లి, ఆగస్టు 10: రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి బీటెక్ విద్యార్థి మృతిచెందిన సంఘటన తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిపై రైల్వేస్టేషన్ వద్ద జరిగినట్లు స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపారు. సేకరించిన వివరాలిలా వున్నాయి... పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురానికి చెందిన కొల్లి హర్షవర్ధన్(19) తిరుపతిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండవ శనివారం, ఆదివారం కలిసిరావడంతో స్నేహితులతో కలిసి దేవాలయానికి వెళ్లేందుకు రైలులో ప్రయాణం చేస్తున్నారు. మార్గమధ్యంలో రైల్వేస్టేషన్ వద్ద కిందకు దిగిన హర్షవర్ధన్ తిరిగి రైలు ఎక్కుతుండగా రైలు కదిలింది. ప్రమాదవశాత్తుగా జారి కిందపడిపోవడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి కొల్లి కోటేశ్వరరావు, తల్లి నాగమణి సామాన్య రైతు కుటుంబం. కోటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, చిన్నకుమారుడు చదువుతూ ప్రమాదవశాత్తు మృతి చెందడం కుటుంబసభ్యులను శోకసంద్రంలో ముంచింది. సమాచారం అందుకున్న మృతుడి స్నేహితులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి


● విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు



మాట్లాడుతున్న దళిత క్రైస్తవ నాయకుడు, పాల్గొన్న విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10: 1950 ఆగస్టు 10న వెలువడిన రాజ్యాంగ ఆర్డర్‌లోని మూడో పేరాలో హిందూమతంలో దళితులకు మాత్రమే ఎస్సీ కోటా వర్తిస్తుందనే రాష్ట్రపతి ఉత్తర్వును రద్దుచేయాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు డిమాండ్ చేశారు. స్థానిక ఏసీ కళాశాలలో దళితులకెందుకు 'ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయి' అనే అంశం మీద శనివారం సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 14 చెప్పిన సమానత్వ హక్కును ఆర్టికల్ 16 చెప్పిన సమాన అవకాశాలను ఈ ఉత్తర్వు అడ్డుకుంటుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన విశ్వసించు, అనుసరించు, ప్రకటించు అనే హక్కును రాష్ట్రపతి ఉత్తర్వు కాలరాసిందని మండిపడ్డారు. దీనిపై 1950 ఆగస్టు 3న జరిగిన చర్చలలో డాక్టర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ ఇతర సభ్యులు కూడా రాష్ట్రపతి ఉత్తర్వును వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు. ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ త్వరలోనే రాష్ట్రపతికి, ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కే మోజెస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పులిగుజ్జు సురేష్, హైకోర్టు న్యాయవాది గడ్డం ఎలీషా, విశ్రాంత ఎస్పీ కే రాజశేఖర్, శివశంకర్, సాల్మన్ వలంపర్తి, యూపీఎఫ్ ప్రెసిడెంట్ కర్ర జోసెఫ్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని బాలుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీచరణ్‌సాయి

గురవాయపాలెం(నరసరావుపేట రూరల్), ఆగస్టు 10: మండలంలోని గురవాయపాలెం వద్ద శనివారం కారు ఢీకొని ఈర్ల లక్ష్మీచరణ్‌సాయి (9) మృతి చెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మీ చరణ్‌సాయి రోడ్డుపై ఆడుకుంటుండగా కారు ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఈర్ల గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

బెల్లంకొండ, ఆగస్టు 10: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బెల్లంకొండ మండలంలోని కొత్తపాలెం గ్రామం వద్ద శనివారం జరిగింది. ఈ సంఘటనలో కొత్తపాలెం గ్రామానికి చెందిన మందా వెంకటేశ్వరరావు(41) మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మృతుడు మందా వెంకటేశ్వరరావు బంధువు వెంకటరావుకు చెందిన దమ్ము ట్రాక్టర్ దిగబడటంతో ఈ విషయం తెలుసుకున్న మృతుడు వెంకటేశ్వరరావు తనకు ఉన్న ట్రాక్టర్‌ను తీసుకొని దిగబడ్డ దమ్ము ట్రాక్టర్ వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను తాడుకు కట్టి లాగేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ లంకలో పడిపోవటంతో వెంకటేశ్వరరావు ట్రాక్టర్ కిందపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపాలెం, బెల్లంకొండ గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహకారంతో ట్రాక్టర్ కిందపడి మృతిచెందిన మందా వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడిని చూడటానికి గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి భార్య నాగమణి, ఇరువురు కుమార్తెలు, ఇరువురు కుమారులు ఉన్నారు. మందా వెంకటేశ్వరరావు బెల్లంకొండలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.

ముగిసిన లీగ్.. నేడు క్వార్టర్, సెమీ ఫైనల్స్

● ఉత్కంఠగా సాగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న విశాఖపట్టణం- కడప జట్లు

వినుకొండ, ఆగస్టు 10: పట్టణంలోని గుడ్‌షఫర్డ్ పాఠశాలలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో లీగ్ దశ ముగిసి ఆదివారం క్వార్టర్ ఫైనల్ జరుగనుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 26 పురుషులు, మహిళా జట్లు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో.. లీగ్ దశలో పోటీపడిన టీమ్‌లలో విజయనగరం, తూర్పుగోదావరి, కడప, అనంతపురం, కర్నూల్, శ్రీకాకుళం, విశాఖపట్టణం, కృష్ణ, విజయనగరం, గుంటూరు, కడప జట్లు గెలుపొందాయి. లీగ్ దశలో పోటీపడిన ఈ 11 జట్లలో కడప, విశాఖపట్టణం, గుంటూరు, శ్రీకాకులం జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరున్నాయి. అదేవిదంగా పురుషుల విభాగంలో అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, కృష్ణ, విజయనగరం, కృష్ణ, విజయనగరం, గుంటూరు జట్లు గెలుపొందగా, వీటిలో అనంతపురం, వియనగరం, చిత్తూరు, గుంటూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం మరికొన్ని లీగ్ పోటీలతో పాటు, క్వార్టర్స్, సెమీఫైనల్ పోటీలు జరగనున్నాయి. ఉత్కంఠంగా సాగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గుడ్ షఫర్డ్ పాఠశాల డైరెక్టర్, డాక్టర్ ఇన్నారెడ్డి క్రీడాకారులకు వసతి, ఆహార సౌకర్యం ఏర్పాటుచేస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ జిల్లా కో-ఆర్డినేటర్ నరసింహారెడ్డి తెలిపారు.

రైళ్ల రీషెడ్యూల్.. దారి మళ్లింపు

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పర్కుల కారణంగా రెండు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెం.17646 రేపల్లె-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13, 14 తేదీల్లో నాలుగు గంటల పాటు రీషెడ్యూల్ చేస్తున్నామన్నారు. నెం.17230 సికింద్రాబాద్ - త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 12, 13, 14 తేదీల్లో 75 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తామన్నారు. నెం.07221 సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్‌ని ఈ నెల 13న కాజీపేట, వరంగల్, విజయవాడ మీదగా దారి మళ్లిస్తున్నామన్నారు. నెం.22882 భువనేశ్వర్ - పూణే ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13న విజయవాడ, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. నెం.07222 సంత్రగచి-సికింద్రాబాద్ రైలు ఈ నెల 11న గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదగా ప్రయాణిస్తుందన్నారు. నెం.12805 విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13, 14 తేదీల్లో 45 నిమిషాల పాటు మార్గమధ్యంలో క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు.

13, 14, 15, 16 తేదీల్లో నాలుగు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో నాలుగు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెం.07187 కాకినాడ టౌన్-సికింద్రాబాద్ రైలు ఈ నెల 13, 15 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నల్గొండ మీదగా మరుసటి రోజు ఉదయం 8.40కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07188 సికింద్రాబాద్-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 14, 16 తేదీల్లో సాయంత్రం 6.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఉదయం 7.10కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

గురజాల జీడీసీసీలో కుంభకోణం

- మిర్చి రైతుల పేరుతో రూ. 6 కోట్ల రుణాలు
- పలువురి ఫిర్యాదుతో విచారణ చేపట్టనున్న అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 10: వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా జీడీసీసీ బ్యాంకుల్లో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరుపుతున్న నేపథ్యంలో గురజాల జీడీసీసీ బ్యాంకులో రూ.6 కోట్ల కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లింది. మొత్తం 150మంది మిర్చి రైతులకు కోల్డు స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి పేర రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. కాగా వాస్తవానికి సదరు కోల్డ్‌స్టోరేజ్‌లో రుణాలు పొందిన రైతులకు చెందిన మిర్చి ఏమీ లేదు. ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తితో పంట నిల్వ విలువను నిర్ధారించి దాని ఆధారంగా రుణాలు మంజూరుచేశారు. పలువురి రైతుల పేర్లతో రుణాలు ఇచ్చినట్లు రికార్డులో చూపించగా, ఆయా రైతులకు వారి పేరుతో బ్యాంకులో లోను వున్న సంగతి తెలియకపోవడం కొసమెరుపు. ఈరుణాల పేరిట సాగిన కుంభకోణంపై ఫిర్యాదుతో అధికారులు రెండు రోజుల్లో గురజాల జీడీసీసీ బ్యాంకులో రికార్డుల పరిశీలన చేయనున్నారు. అప్పుడే ఈ వ్యవహారంలో అసలు సూత్రదారులు, పాత్రదారులు ఎవరన్నది తేలతెల్లం కానుంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,ఆగస్టు 10: నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ పాలక మండలి సభ్యులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం రెంటచింతలకు చెందిన ఎస్ఎంసీ చైర్మన్ విశ్వరూపాచారి తదితరులు ఎమ్మెల్యే జూలకంటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల తరహాలో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు బాగా కృషిచేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ, నూతన ఎస్ఎంసీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటుని అందించాలని సూచించారు. పాఠశాలల్లో బాల బాలికల హాజరు శాతం పెరిగేలా చూడాలని కోరారు. ఎస్ఎంసీ పాలక మండలి సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, మారాజు శ్రీను, బుజ్జి, రంగాచారి పాల్గొన్నారు.


వృద్ధురాలి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 10: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకొని వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తుందని, అందులో భాగంగానే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీన్ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అమితంగా గౌరవిస్తాం..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను టీడీపీ నేతలు, శ్రేణులు అమితంగా గౌరవిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నరుకులపాడు గ్రామంలో ఆయన స్థానిక టీడీపీ నేతలతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్న అక్షరాలను తొలగించటం అంబేద్కర్‌ను అవమానించటం కాదన్నారు. అయినా అంబేద్కర్ విగ్రమం కింద ఉన్న జగన్‌మోహన్ రెడ్డి పేరును ఎవరో ఆగంతకులు తొలగిస్తే టీడీపీ నేతలు తొలగించారన్నట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరును జగన్ విదేశీ విద్యగా మార్చి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే నాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచిందని భాష్యం ప్రవీణ్ అన్నారు.

పంజావిసిరిన డయేరియా


మాచవరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

- గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో బాధితులు
- పీహెచ్‌సీలో తొమ్మిది మందికి చికిత్స
- నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి ముగ్గురు తరలింపు
- కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు.. మందుల పంపిణీ
- విస్తృతంగా పారిశుధ్య చర్యలు

మాచవరం, ఆగస్టు 10: మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామం, ఎస్సీ కాలనీలో డయేరియా పంజా విసిరింది. కాలనీలోని తొమ్మిది మందికి వాంతులు, విరోచనాలు కాగా కొంతమంది మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకొని గ్రామానికి చేరుకున్నారు. శనివారం మరికొంత మందికి వాంతులు, విరోచనాలు కావడంతో వారూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఎస్సీ కాలనీకిచెందిన గుంటగాని కాంతమ్మ, పోతిపోగు శరణ్య, పోతిపోగు వినయ్‌కుమార్, గుంటగాని బుజ్జి, నందిపాటి చంటి, నందిపాటి సాగర్, పోతిపోగు కోటమ్మ, చల్లా రాశి, గుంటగాని యాకోబులు మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పోతిపోగు కోటమ్మ, చల్లా రాశి, గుంటగాని యాకోబులకు తీవ్రత ఎక్కువగా వుండటంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాచవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్‌లు, ఆరోగ్య సిబ్బంది గంగిరెడ్డిపాలెం గ్రామానికి చేరుకొని ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి డయేరియా లక్షణాలు వున్న వారిని పీహెచ్‌సికి తరలించారు. అదేవిధంగా ఎస్సీకాలనీలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలోని అన్ని వీధులలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వీధుల వెంట బ్లీచింగ్, సున్నం చల్లించారు. బోరు బావులలోనూ బ్లీచింగ్ వేయించారు. ఎస్సీ కాలనీలోని మినీ వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే నీటిని తాగడం వలనే ప్రజలు విరేచనాలు, వాంతులతో (డయేరియా లక్షణాలు) ఆస్పత్రి పాలవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.


గంగిరెడ్డిపాలెంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మాచర్ల రూరల్, ఆగస్టు 10: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పాత రైలు కట్ట ప్రాంతానికి చెందిన షేక్ అహ్మద్ సలీం (42) అదే ప్రాంతంలో నూతనంగా ఇల్లు నిర్మించి రంగులు వేయిస్తున్నాడు. శుక్రవారం అర్థరాత్రి సమయంలో ఆఇంట్లోకి వెళ్లి పిల్లర్‌కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రభాకరరావు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య మునిషాబేగం ఫిర్యాదు మేరకు సీఐ ప్రభాకరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో అవినీతిపై విచారణ

రెంటచింతల, ఆగస్టు 10 : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని గంగా భ్రమారంబ సమేత మల్లిఖార్జునస్వామివార్ల ఆలయంలో జరిగిన అవినీతిపై దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ పీ.సైదాబాయి నేతృత్వంలో అధికారుల బృందం విచారణ చేపట్టింది. టీడీపీకి చెందిన బోడపాటి రామకృష్ణతో పాటు మరో ఏడుగురు ఈ ఫిర్యాదు చేశారు. వాచ్‌మెన్లు, స్వీపర్లు, అర్చకస్వాములకు నెలల తరబడి జీతాలివ్వకపోవడం, దేవస్థాన భూములకు సకాలంలో వేలం నిర్వహించకపోవడం, టిక్కెట్ల విక్రయం ద్వారా వచ్చిన నగదు, శివలింగాన్ని తీసి వేసి స్ఫటిక స్పర్శలింగాన్ని అనుమతి లేకుండా ఏర్పాటు చేశారనే అంశాలపై సమాచారాన్ని సేకరించారు. సుమారు రూ.16.10 లక్షల మేర అవినీతికి ఈవో నెమలిరెడ్డి పాల్పడినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విచారణలో సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఈవో కృష్ణారావు, ట్రస్టుబోర్డు చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి,సిద్దయ్య,అర్చకులు పాల్గొన్నారు.


రవిని సన్మానిస్తున్న గాదె వెంకటేశ్వర్లు

జనసేన నేత రవికి సన్మానం

మాచర్లటౌన్, ఆగస్టు 10: జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం మాచర్ల నియోజకవర్గంలో భారీ స్థాయిలో జరిగింది. ఇందుకు కృషి చేసిన జనసేన నేత రుద్రాల రవిని శనివారం గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ గుంటటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. అలాగే సభ్యత్వ నమోదుకు కృషిచేసిన పార్టీ వలంటీర్లను ఆయన అభినందించారు.

సంగం డెయిరీలో బోనస్ పంపిణీ

మాచవరం,ఆగస్టు10: మండలంలోని వేమవరం సంగం డెయిరీలో శనివారం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీచేశారు. రూ.79,03,169 పాల బట్వాడా జరుగగా నూటికి రూ. చొప్పున 267 మందికి రూ.6,32,854 బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు, స్థానిక సంగం అధ్యక్షుడు నారప శెట్టి నారయ్య, మాజీ అధ్యక్షుడు శానంపూడి శివారెడ్డి, కార్యదర్శి పాపయ్య, లంకమల్లె కొండలు, కర్రి శ్రీను, రూట్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకి సత్కారం

వెల్దుర్తి, ఆగస్టు 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న నరసింహంను అధికారులు, కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి నరసింహం బదిలీపై వచ్చారు. నంతరం ఈయన బదిలీపై ప్రకాశం జిల్లా మార్కాపురంకు వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సమావేశాలు

అచ్చంపేట, ఆగస్టు 10 :మండల కేంద్రమైన అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన రెండు రోజుల అవగాహన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సమావేశంలో గ్రామాల్లో పారిశుధ్యం, వీధి లైట్లు నిర్వహణ, స్వచ్ఛ భారత్ తదితర అంశాలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో కే. కుసుమ కుమారి, ఈవోఆర్‌డీ కే.వీరరాజు, ఏవో ఏ.రమేష్ బాబు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 10 : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి 3,29,081 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పులిచింతల ప్రాజెక్టు 15 గేట్ల నుంచి 3,16,396 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. 16 వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతుంది.

టెయిల్‌పాండ్‌కు భారీగా వరద నీరు

రెంటచింతల, ఆగస్టు 10: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు ఎగువన వున్న సాగర్ నుంచి వచ్చి చేరుతుందని ఎస్ఈ కొలే గుండ్ల వెంకటరమణ చెప్పారు.సాగర్ నుంచి 3 లక్షల 41 వేల 866 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టుకున్న 12 గేట్లను 5.5 మీటర్ల ఎత్తి 3 లక్షల 41 వేల 340 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.08 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.26 టీఎంసీలకు సమానమన్నారు.

సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

మాచర్లటౌన్, ఆగస్టు 10: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపును శనివారం ప్రిన్సిపాల్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈక్యాంపు వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కోచ్ పుచ్చకాయల బాలకృష్ణ శిక్షణను పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో పీడీ కుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

కారంపూడి, ఆగస్టు 10: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మండల ఆర్యవైశ్యసంఘ ఎన్నికలో అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌పీఆర్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా దాచేపల్లి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు మాశెట్టి బుజ్జి అధ్యక్షతన భవిరిశెట్టి రామారావు వ్యవహరించారు. అనంతరం సంఘ నూతన అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సత్యనారాయణలను యువజన సంఘ నేతలు దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎంపీడీవో శంకరరావు సేవలు ప్రశంసనీయం

రెంటచింతల,ఆగస్టు 10 : ఎంపీడీవో పెదప్రోలు శంకరరావు సేవలు ప్రశంసనీయమని ఈవో పీఆర్డీ జీ.కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలంలో బదిలీపై వెళ్తున్న శంకరరావును కార్యాలయ అధికారులు, సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం కృష్ణా జిల్లా ఆగిరపల్లి నుంచి ఇక్కడకు వచ్చిన శంకరరావు ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకుని ప్రశాంతంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏవో రాజేష్,సీనియర్ అసిస్టెంట్ అంజిబాబు,శౌరీ కుమారి,ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గజాపురంలో వైద్య శిబిరం

దుర్గి, ఆగస్టు 10: మండల పరిధిలోని గజాపురం చెంచు తండాలో శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సైదులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మాచర్ల రూరల్, ఆగస్టు 10: మాచర్ల సెబ్ అధికారులు శనివారం వెల్దుర్తి మండలం కండ్లకుంట శివారు వద్ద దాడులు నిర్వహించి 75 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. కాగా తాము తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో నిందితుడు పరారయ్యాడని, అతనిపై కేసు నమోదు చేశామని సెబ్ అధికారులు తెలిపారు.

కారంపూడి సీఐకి సత్కారం

దుర్గి, ఆగస్టు 10: కారంపూడి సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన టీవీ శ్రీనివాసరావును శనివారం కూటమి నేతలు దుర్గి పోలీస్ స్టేషన్‌లో కలిసి దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కాగా శ్రీనివాసరావు గతంలో దుర్గి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్, ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇటీవల కారంపూడి సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన దుర్గి పోలీస్ స్టేషన్‌కు రావడంతో స్థానిక ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ సర్పంచ్ యెల్లెబోయిన గోపాల్, రామారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, చిన చెన్నయ్య, హరి, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 10: మండల పరిషత్ సమావేశపు హాలులో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ప్రజా ప్రతినిధుల విధులు, బాధ్యత, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో సుబ్బారావు, టీవోటీలుగా ఈవోపీఆర్డీ సీహెచ్ భార్గవ, పంచాయతీ కార్యదర్శులు స్వామినాయక్, కాల్వ కోటేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, పలువురు కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చారిత్రక దేవాలయం

- అభివృద్ధిని విస్మరించిన దేవాదాయశాఖ

నకరికల్లు, ఆగస్టు 10: ఎంతో చారిత్రక ప్రాశస్త్యం పొందిన కుంకలగుంటలోని వేణుగోపాలస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు నాలుగు శతాబ్దాల క్రితం ఈ దేవాలయాన్ని నిర్మించారు. ఆనాటి నుంచి ఈ ప్రాంత ప్రజలు వేణుగోపాల స్వామిని ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ వచ్చారు. ఈ పురాతన దేవాలయం పై భాగం పూర్తిగా పడి పోయే పరిస్థితుల్లో ఉంది. ఆలయ ప్రాంగణ మంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు గతంలో దేవాదాయశాఖ అధికారులు అంచనాలను సిద్ధం చేశారు. అయితే అందుకు మ్యాచింగ్ గ్రాంట్ సకాలంలో అందజేయక పోవటంతో ఆలయ అభివృద్ధి అలాగే నిలిచి పోయింది. ఎంతో పేరు పొందిన ఈ దేవాలయంను పునఃర్నిర్మించి అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన వేణుగోపాల స్వామి దేవాలయం


ఆలోకం కృష్ణయ్య ను పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేయాలి

- పల్నాడు జిల్లా టీడీపీ, బీజేపీ అధ్యక్షుల పిలుపు

గుంటూరు సిటీ, ఆగస్టు 10: ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ఈ నెల 15న జరగనున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా టీడీపీ, బీజేపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఆలోకం సుధాకర్‌బాబులు శనివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆరోజున ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. దేశం కోసం జరుగుతున్న ఈ మహోన్నత కార్యమాన్ని ప్రజలందరూ నిర్వహించి, దేశ భక్తిని చాటుకోవాలని కోరారు.

ఆలోకం కృష్ణయ్యకు పరామర్శ. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పల్నాడు బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ తండ్రి ఆలోకం కృష్ణయ్యను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పరామర్శించారు. గుంటూరులోని ఆయన నివాసానికివెళ్లి కలిశారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత నెలకుదుటి వరప్రసాద్ (బుజ్జి), బీజేపీ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి పునుగుల రవి శంకర్, సత్తెనపల్లి బీజేపీ నేత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

నకరికల్లు, ఆగస్టు10: ప్రభుత్వం సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి కే.దేవదాసు తెలిపారు. శనివారం మండలంలోని చీమలమర్రి గ్రామంలో రైతు సేవా కేంద్రం ద్వారా విత్తనాలను పంపిణీ చేశారు. జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నాయంగా కేఎన్ఎం 1638 రకం ఒక కిలో ధర రూ.40.50కాగా సబ్సిడీ పోగా రూ.35.50 చెల్లించాలని, ఎంటీయూ 1224 రకం ఒక కిలో పూర్తి ధర రూ.41.80 కాగా సబ్సిడీ పోగా రూ.36.80 చెల్లించాలని తెలిపారు. ఈ వరి విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్‌లతో రైతుసేవా కేంద్రాల్లో తీసుకోవాలని సూచించారు. చీమలమర్రి, కుంకలగుంట, చల్లగుండ్ల, రూపెనగుంట్ల, దేచవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈ వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జగదీష్, శ్రీహరి, హనుమంతరావు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి మేఘమాల తదితరులు

ఆయుర్వేద వైద్యశిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 10: పబ్లిక్ హెల్త్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 6వ వార్డులోని ఎస్టీ కాలనీలో వున్న 4వ సచివాలయంలో వైద్యాధికారి మేఘమాల రోగులను పరీక్షించి రక్తహీనత, ఎముకలు, కీళ్ల నొప్పులు, హెచ్‌టీఎన్ వ్యాధులకు సంబంధించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం పై దాని ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీ.ప్రభుప్రసాద్, డీ.బాబు, హనుమంతరావు నాయక్, కోటేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ సీతామహాలక్ష్మీ, అడ్మిన్ వీరాంజనేయులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

సత్తెనపల్లి, ఆగస్టు 10 : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని వేద జూనియర్ కళాశాల విద్యార్థులకు టీడీపీ నేతలు కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి, టీడీపీ నేతలు మక్కపాటి రామచంద్రరరావు, పూజల వెంకట కోటయ్య, చలపతిరరావు, ఉల్లంశేషగిరిరావు, దివ్వెల శ్రీనివాసరావు, కొమ్మిశెట్టి సాంబశివరావు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జస్టిస్ లాగోస్‌కు ఘన సన్మానం

సత్తెనపల్లి, ఆగస్టు 10 : జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ లాగోస్ ఇంటర్నేషనల్ హైదరబాద్ వారిచే గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా శనివారం సత్తెనపల్లి కళా మిత్ర మండలి, ఉషోదయ కళా పరిషత్, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో మాతంగి సాంబశివరావు, తూములూరి రాజేంద్ర ప్రసాదు, లాం వర్ధనరంరావు, ఎం వెంకట స్వామి, శ్రీనివాష్, ఎర్మియా, రమణారెడ్డి, ప్రసాదు పాల్గొన్నారు.

నేత్రాలకు జాగ్రత్తలు పాటించాలి

పెదకూరపాడు, ఆగస్టు 10 : నేత్రాల సంరక్షణకు ప్రతి ఒక్కరు డాక్టర్ల సూచనలను సలహాలను పాటించాలని యూనియన్ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ కార్యంశెట్టి లూర్దురాజు అన్నారు. పెదకూరపాడులో కొమరాబత్తుని రోజమ్మ, కార్యంశెట్టి జయరావుల జ్ఞాపకార్థం శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి ఆపరేషన్‌లు చేసుకున్న వారికి కళ్ళ జోళ్ళను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులను ఆదుకోండి

క్రోసూరు, ఆగస్టు 10 : ప్రజలందరూ మానవతా హృదయంతో విరాళాలు అందజేసి కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.రవిబాబు పిలుపునిచ్చారు. శనివారం క్రోసూరులో పలు వ్యాపార సంస్థలు, గృహాల వద్దకు వెళ్ళి కేరళలోని వయనాడు వరద బాధితుల సహాయార్థం విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. భారీవర్షాలు, వరదలతో సర్వస్వం నష్టపోయిన, నిరాశ్రయులైన వారిని ఆదుకోవట మన కర్తవ్యం అని సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు అన్నారు. సేకరించిన విరాళాలను వరద బాధితులకు పంపిస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రావెల వెంకటేశ్వర్లు, చిలకా ఏసయ్య, గన్నెపూడి మహేష్, పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే ప్రజాదరణ

నకరికల్లు, ఆగస్టు 10 : అంకిత భావంతో పనిచేస్తే ప్రజలు తప్పక ఆదరిస్తారని ఎంపీడీవో డీ జయమణి అన్నారు. బదిలీపై ప్రకాశంజిల్లాకు వెళుతున్న ఆమెను శనివారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవం

మాచర్లటౌన్, ఆగస్టు 10: మాచర్ల పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఆ సంఘ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎంతగానో పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు నాసర్ రెడ్డి, ఆయేషా సుల్తానా, హెచ్ఎం షకీనా, గాలీబు, ఈశ్వరయ్య, సత్యానారాయణ, శాంతాబాయి, నాగరాజు, బాలాజీనాయక్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన ఆ సంఘ నేతలు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బాబు సారథ్యంలో గిరిజనులకు పూర్తి న్యాయం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 10: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో గిరిజనులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో గల మెడికల్ అసోసియేషన్ హాల్లో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజనుల హక్కులతో పాటు వైద్య ఉపాధి రంగాల్లో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో గిరిజనులు అధికంగా ఉండే ప్రాంతాన్ని వచ్చే ఎన్నికల్లో గిరిజనుల నియోజకవర్గంగా గుర్తించే అవకాశం ఉందని అన్నారు. అక్కడి నుంచి గిరిజనులు ప్రజా ప్రతినిధిగా పోటీ చేసే అవకాశం రాగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గిరిజనులకు సంబంధించి గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తుందన్నారు. తాను గిరిజనులకు అన్ని విధాలా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు బీ శ్రీనునాయక్, కుంబా నాగేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన చెరుకుపల్లి నిర్మల, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, బీ చిన్న, పాలపర్తి శ్రీనివాసరావు, డీ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిటీ చైర్మన్‌గా సుదర్శనరావు ఎన్నిక

చిలకలూరిపేట, ఆగస్టు 10: చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని మద్ది కామయ్య జడ్పీ హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్‌గా కోట సుదర్శనరావు , వైస్ చైర్మన్‌గా షేక్ గౌసియా, ఎన్నికయ్యారు. కో-ఆప్షన్ సభ్యులుగా గద్దె హరిబాబు, మర్రి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

చిలకలూరిపేట, ఆగస్టు 10: మండలపరిధిలోని గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12న, 13, 14 తేదీల్లో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. చిలకలూరిపేట మండలపరిషత్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం విషయాలపై ఈ శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. సర్పంచులందరూ తప్పనిసరిగా హాజరై శిక్షణలో పాల్గొనాలని తెలిపారు.

పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు

● జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



జనసేన నాయకులను సత్కరిస్తున్న గాదె వెంకటేశ్వరరావు తదితరులు

చిలకలూరిపేట, ఆగస్టు 10: జనసేన పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరిని పార్టీ నాయకత్వం గుర్తిస్తుందని జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో వెయ్యికి పైగా సభ్యత్వాలను నమోదు చేయించిన వారిని గుర్తించి గుంటూరులో జరిగిన కార్యక్రమంలో శనివారం సత్కరించారు. చిలకలూరిపేట నియోజకవర్గ పార్టీ నాయకులు రాజా రమేష్, చరణ్ తేజ తదితరులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, షేక్ మునీర్ హసన్, ఖాన్ ఖాదర్ బాషా, సూర్య, అయ్యప్ప, తేజ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత అభిమన్యుకు అభినందనలు



పారెళ్ళ అభిమన్యును అభినందిస్తున్న గాదె వెంకటేశ్వరరావు, నాగ శ్రీను.

వినుకొండ, ఆగస్టు 10: జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను రాయల్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమంలో జిల్లాలో 500 పైగా సభ్యత్వ నమోదుచేసిన జనసేన సీనియర్ నాయకులు పారెళ్ళ అభిమన్యును గుంటూరులో గాదె వెంకటేశ్వరరావు శనివారం ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



రేవతి యశస్వినికి ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 10: నరసరావుపేటకు చెందిన బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ శనివారం ఎన్‌జీవో కాలనీలో ఉన్న కార్యాలయంలో ఆర్థిక సాయం చేసింది. పెదనందిపాడుకు చెందిన నూనె రేవతి యశస్విని జూనియర్ ఇంటర్‌లో రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించింది. హైదరాబాద్ ఎన్‌టీఆర్ ట్రస్ట్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న నూనె రేవతి యశస్వినికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బొల్లు రాజేశ్వరి 80వ జయంతి సం దర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని సినీ నటుడు, ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకటకృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో బొల్లు వెంకటేశ్వర్లు, బొల్లు నరసింహారావు, మర్లపాటి రామకృష్ణా, జాష్టి గోపాలకృష్ణబాబు, డాక్టర్ బొల్లు సాయిరామ్, బొల్లు రాకేష్ పాల్గొన్నారు.

గురజాల డీసీసీబీలో కుంభకోణం

● మిర్చి రైతుల పేరుతో రూ. 6 కోట్ల రుణాలు

● పలువురి ఫిర్యాదుతో విచారణ చేపట్టనున్న అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 10: వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీ బ్యాంకుల్లో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరుపుతున్న నేపథ్యంలో గురజాల డీసీసీ బ్యాంకులో రూ.6 కోట్ల కుంభకోణం వ్యవహా రం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లింది. మొత్తం 150మంది మిర్చి రైతులకు కోల్డు స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి పేర రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. కాగా వాస్తవానికి సదరు కోల్డ్‌స్టోరేజ్‌లో రుణాలు పొందిన రైతులకు చెందిన మిర్చి ఏమీ లేదు. ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తితో పంట నిల్వ విలువను నిర్ధారించి దాని ఆధారంగా రుణాలు మంజూరుచేశారు. పలువురి రైతుల పేర్లతో రుణాలు ఇచ్చినట్లు రికార్డులో చూపించగా, ఆయా రైతులకు వారి పేరుతో బ్యాంకులో లోను ఉన్న సంగతి తెలియకపోవడం కొసమెరుపు. ఈరుణాల పేరిట సాగిన కుంభకోణంపై ఫిర్యాదుతో అధికారులు రెండు రోజుల్లో గురజాల డీసీసీ బ్యాంకులో రికార్డుల పరిశీలన చేయనున్నారు. అప్పుడే ఈ వ్యవహారంలో అసలు సూత్రదారులు, పాత్రదారులు ఎవరన్నది తేలతెల్లం కానుంది.

ఆలయంలో అవినీతిపై విచారణ

రెంటచింతల, ఆగస్టు 10 : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామివార్ల ఆలయంలో జరిగిన అవినీతిపై దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ పీ.సైదాబాయి నేతృత్వంలో అధికారుల బృందం విచారణ చేపట్టింది. టీడీపీకి చెందిన బోడపాటి రామకృష్ణతో పాటు మరో ఏడుగురు ఈ ఫిర్యాదు చేశారు. వాచ్‌మెన్లు, స్వీపర్లు, అర్చకస్వాములకు నెలల తరబడి జీతాలివ్వకపోవడం, దేవస్థాన భూములకు సకాలంలో వేలం నిర్వహించకపోవడం, టిక్కెట్ల విక్రయం ద్వారా వచ్చిన నగదు, శివలింగాన్ని తీసి వేసి స్ఫటిక స్పర్శలింగాన్ని అనుమతి లేకుండా ఏర్పాటు చేశారనే అంశాలపై సమాచారాన్ని సేకరించారు. సుమారు రూ.16.10 లక్షల మేర అవినీతికి ఈవో నెమలిరెడ్డి పాల్పడినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విచారణలో సత్తెనపల్లి ఇన్స్‌పెక్టర్ లీలావతి, ఈవో కృష్ణారావు,ట్రస్ట్ బోర్డు చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి,సిద్దయ్య,అర్చకులు పాల్గొన్నారు.

పల్నాడును ఎండబెట్టిన ఘనుడు జగన్‌రెడ్డి

● త్వరలో కరువు నివారణకు ప్రాజెక్టు పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండటౌన్, ఆగస్టు 10: కరువు నివారణ ప్రాజెక్టుకు తండ్రి పేరు పెట్టుకుని మరీ పల్నాడు ప్రాజెక్టును ఎండబెట్టిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన సాగు, తాగునీటి నీటి ప్రాజెక్టులకు కనీసం రూపాయి కూడా ఇవ్వకుండా, కిలో మీటర్ పని కూడా ముందుకు తీసుకెళ్లకుండా నీటి ప్రాజెక్టులను నిర్వీ ర్యం చేశారని ఒక ప్రకటనలో జీవీ తెలిపారు. రాష్ట్రంలోని కీలకమైన సాగు, తాగునీటి ప్రాజెక్టులన్నిటికీ పాత పేర్లు పునరుద్ధరిస్తూ, పల్నాడు జిల్లా కరువు నివారణ ప్రాజెక్టుకు వైఎస్ పేరును తొలగించాలన్న ప్రభు త్వ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. అత్యంత వెనుకబాటుకు చిరునామాగా ఉన్న పల్నాడు ప్రాంతంలో నీళ్లు ఇచ్చే పథకానికి ఐదేళ్లుగా మోకాలడ్డారని, తండ్రి పేరు పెట్టుకుని కూడా పైసా పని జగన్‌రెడ్డి చేయలేదని విమర్శించారు. పల్నాడు ప్రాంత కరువు కష్టాలు తీర్చడానికి నదులు అనుసంధానం ఒక్కటే మార్గం అన్నారు. పెన్నా- గోదావరి లింక్ కీలకమని మొదట గుర్తించి, పథకాన్ని పట్టా లెక్కించడానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గత తెలుగుదేశం ప్రభు త్వం హయాంలో నడుంబిగించారని తెలిపారు. ఆ దిశగానే గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని ఏర్పాట్లు చేసి, కాంట్రాక్టర్లను నియమించి, పనులు ప్రారంభించినా, జగన్‌రెడ్డి వాటిని పట్టించుకోకుండా నిరుపయోగంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు చేసిన కాంట్రాక్టర్లకు కనీసం బిల్లులు కూడా చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధించారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టుపై దృష్టి సారిండం శుభపరిణామమని, సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో కరువు నివారణ ప్రాజెక్టు పూర్తయి, పచ్చని పల్నాడు స్వప్నం సాకారం అవుతుందనే నమ్మకం కలుగుతుందని తెలిపారు.

ఆక్రమణ నుంచి తన పొలం ఇప్పించాలని మహిళ నిరసన



నరసరావుపేటలో పొలం వద్ద నిరసన తెలుపుతున్న మహిళ, కుటుంబసభ్యులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 10: మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామ పరిధిలో గల సర్వే నెంబర్ 177/10లో ఎకరం పొలం పట్టా భూమి దళిత బహుజనుల హక్కుల పోరాటసమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గొట్టిముక్కల సుజాతకు చెందిందని ఆమె పొలాన్ని ఇక్కుర్రుకు చెందిన బొడ్డపాటి హనుమంతరావు, బొడ్డపాటి అంజమ్మ, బొడ్డపాటి సత్యనారాయణ ఆక్రమించుకొని తమను పొలంలోకి రానివ్వకుండా తమపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మహిళ ఆరోపించారు. ఈ విషయంపై గతంలో జాతీయ ఎస్సీ కమిషన్‌కు, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదుచేశామని ఎస్సీ కమిషన్ ఆదేశాల మేరకు అప్పటి రెవెన్యూ అధికారులు తమ పొలాన్ని కొలిపించి సర్వే హద్దులు ఏర్పాటు చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేసి సర్వేయర్ సర్టిఫికేట్‌ను అందించారని చెప్పారు. అయినప్పటికీ పైన తెలిపిన ముగ్గురు పొలం లోకి తమను రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రెండ్రోజుల క్రితం పొలంలోకి వచ్చిన తనను కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురిచేశారని మనస్థాపానికి గురై నిద్రమాత్రలు మింగానని అందుకు సంబంధించిన ఘటనపై నరసరావుపేట రూరల్ పోలీసులు ఫిర్యాదు కూడా నమోదు చేశారని తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయకపోయేసరికి తమ ఇద్దరు బిడ్డలతో తమ పొలంలోనే నిరాహార దీక్ష చేపట్టానని అధికారులు తమ సమస్యను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని గొట్టిముక్కల సుజాత తెలిపారు.

దళితుల విద్యాభివృద్ధికి కార్డ్స్ సంస్థ ప్రత్యేక కృషి

● సంస్థ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి.పుష్ప



సమావేశంలో పాల్గొన్న కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ టి.పుష్ప

నరసపరావుపేట రూరల్, ఆగస్టు 10: దళితుల విద్యాభివృద్ధికి కార్డ్స్ సంస్థ ప్రత్యేక కృషి చేస్తుందని కార్డ్స్ సంస్థ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి.పుష్పా తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలోని లాల బహదూర్ స్కూల్ దగ్గర శనివారం బాలబాట డీవోల శిక్షణ తరగతుల కార్యక్రమమం నిర్వహించారు. ఈ కార్యకమానికి స్థానిక ఏరియా కోర్డినేటర్ నూనె ప్రకాశరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్డ్స్ సంస్థ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి.పుష్ప మాట్లాడుతూ పేద వర్గాలను గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేసి బాలబాటల ద్వారా వారికి తర్ఫీదునిచ్చి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే కార్డ్స్ సంస్థ కృషి అన్నారు. అనంతరం పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేద వర్గాలు అభివృద్ధి చెందుతాయని, 20 సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల అభ్యున్నతి కోసం వారికి ఆటపాటలతో చదువు నేర్పిస్తూ పచ్చదనం పరిశుభ్రత కలిగి ఇంటి పెరటి తోటలోని బాలబాట ద్వారా ఇచ్చిన పది రకాల కూరగాయల విత్తనాల నాటించారు. అనంతరం నెలవారి నిత్యావసర సరుకులను 30 మందికి డిప్యూటీ డైరెక్టర్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో ముప్పాళ్ల, నరసరావుపేట మండలాల ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● మాజీ ఎంపీపీ ఎం రామారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రొంపిచర్ల, ఆగస్టు 10: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుజాత పాల్, అన్నవరపు కిషోర్, కందుల యజ్ఞాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ మొండితోక రామారావు రొంపిచర్ల పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కావాలని ఈ వ్యాఖ్య లు చేయటం దుర్మార్గమని రామారావు తెలిపారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. కుమ్మెత కోటిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో అర్జీలను పగల గొట్టిన ఘనత మీది కాదా? ప్రశ్నించారు. గ్రామాల్లో చిచ్చు పెట్టి చోద్యం చూసింది గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అని పేర్కొన్నారు. పులకూరి జగ్గయ్య మాట్లాడుతూ శిలా ఫలకాలు ధ్వంసం చేసే ఘనత వైసీపీదేనన్నారు. కొలికొండ కొండలు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం పైనే దాడి చేసింది మీరు కాదా? అన్నారు. కావాలని తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చారన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని పేర్కొన్నారు. ఇదేవిధంగా మాట్లాడుతుంటే తగిన బుద్ధి చెపుతామని అన్నారు. కార్యక్రమంలో శాకమూరి రామ్మూర్తి, పేరుపోగు దాసు, గుండ్రాదాసు, అల్లూరి కోటేశ్వరరావు, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 10 : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి 3,29,081 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పులిచింతల ప్రాజెక్టు 15 గేట్ల నుంచి 3,16,396 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. 16 వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతుంది.

టెయిల్‌పాండ్‌కు భారీగా వరద నీరు

రెంటచింతల, ఆగస్టు 10: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు ఎగువన వున్న సాగర్ నుంచి వచ్చి చేరుతుందని ఎస్ఈ కొలేగుండ్ల వెంకటరమణ చెప్పారు.సాగర్ నుంచి 3 లక్షల 41 వేల 866 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టుకున్న 12 గేట్లను 5.5 మీటర్ల ఎత్తి 3 లక్షల 41 వేల 340 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.08 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.26 టీఎంసీలకు సమానమన్నారు.

సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

మాచర్లటౌన్, ఆగస్టు 10: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపును శనివారం ప్రిన్సిపాల్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈక్యాంపు వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కోచ్ పుచ్చకాయల బాలకృష్ణ శిక్షణను పర్యవేక్షిస్తారన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

కారంపూడి, ఆగస్టు 10: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మండల ఆర్యవైశ్యసంఘ ఎన్నికలో అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌పీఆర్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా దాచేపల్లి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు మాశెట్టి బుజ్జి అధ్యక్షతన భవిరిశెట్టి రామారావు వ్యవహరించారు. అనంతరం సంఘ నూతన అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సత్యనారాయణలను యువజన సంఘ నేతలు దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 10: మండల పరిషత్ సమావేశపు హాలులో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ప్రజా ప్రతినిధుల విధులు, బాధ్యత, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో సుబ్బారావు, టీవోటీలుగా ఈవోపీఆర్డీ సీహెచ్ భార్గవ, పంచాయతీ కార్యదర్శులు స్వామినాయక్, కాల్వ కోటేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, పలువురు కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 10: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. టీడీపీ జాతీయ కార్యాల యంలో శనివారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఆదే శాల మేరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసు కొని వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తుందని, అందులో భాగంగానే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అమితంగా గౌరవిస్తాం..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను టీడీపీ నేతలు, శ్రేణులు అమితంగా గౌరవిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నరుకులపాడు గ్రామంలో ఆయన స్థానిక టీడీపీ నేతలతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్న అక్షరాలను తొలగించటం అంబేద్కర్‌ను అవమానిం చటం కాదన్నారు. అయినా అంబేద్కర్ విగ్రమం కింద ఉన్న జగన్‌మోహన్ రెడ్డి పేరును ఎవరో అగంతకులు తొలగిస్తే టీడీపీ నేతలు తొలగించారన్నట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. .



వృద్ధురాలి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న భాష్యం ప్రవీణ్

యూటీఎఫ్ స్వర్ణోత్సవం

మాచర్లటౌన్, ఆగస్టు 10: మాచర్ల పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఆ సంఘ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎంతగానో పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు నాసర్‌రెడ్డి, ఆయేషా సుల్తానా, హెచ్ఎం షకీనా, గాలిబు, ఈశ్వరయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

● ప్లాస్టిక్ జెండాలు వద్దు.. కాటన్ జెండాలు ముద్దు...



సమావేశంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 10: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని జెండా ఎగురవేసి నమస్కరించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ఈనెల 15న జరుగుతున్న నేపథ్యంలో, పల్నాడు జిల్లాలో కూడా ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు మాట్లాడుతూ కుల మత పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు నెలకుదుటి వరప్రసాద్ (బుజ్జి), బీజేపీ ఒంగోలు జిల్లా ఇన్‌చార్జ్ పునుగుల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 పరిధిలోని రైతులకు నీరు అందిస్తాం

● ఎస్సైస్పీ చీఫ్ ఇంజనీరు రవి

వినుకొండటౌన్, ఆగస్టు 10: నాగార్జున సాగర్ కుడికాలవ కింద వరి పండించే జోన్-2 రైతులకు కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని ఎన్నెస్పీ చీఫ్ ఇంజనీరు కడియాల రవి శనివారం తెలిపారు. జోన్-1 పరిధిలోని, పల్నాడు జిల్లా రైతులు వరి పండించేందుకు ఇప్పటికే నార్లు పోశారని, వరి నాట్లు పూర్తయ్యే సరికి కొంత సమయం ఉన్నపటికీ, కాలువకు నీరు విడుదల చేస్తామని, జోన్-2 పరిధిలోని ప్రకాశం జిల్లా రైతులు, జోన్-1 పరిధిలోని రైతులకంటే సుమారు నెల రోజుల తర్వాత వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. జోన్-1, జోన్-2 పరిధిలోని రైతులకు సంవృద్ధిగా కాలవలకు నీరు అందిస్తామన్నారు. జోన్-2 పరిధిలోని రైతులు నీరు అందవనే అపోహలు పడవద్దని తెలిపారు.

రైతులకు స్వల్పకాలిక వరి విత్తనాలు

5 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధం : జిల్లా వ్యవసాయాధికారి మురళి



పెదరెడ్డిపాలెంలో రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి

10పెదరెడ్డిపాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 10: జిల్లాలో స్వల్పకాలిక వరి విత్తనాలు 5 శాతం రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి తెలిపారు. నరసరావుపేట మండలంలోని పెద్దరెడ్డిపాలెంలో శనివారం రాయితీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ మురళి మాట్లాడుతూ రైతులకు స్వల్పకాలిక వరి రకాలైన ఎన్ ఎల్ ఆర్ 34449, కేఎన్ఎం 1638 అను రకాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఒక కేజీ విత్తనానికి ప్రభుత్వం రూ.5 సబ్సిడీ ఇస్తుందన్నారు. వరిలో స్వల్పకాలిక రకాలైనటువంటి ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ - 34449, రకాల గురించి రైతులకు అవగాహన కలిగించారు. జేజీఎల్ - 384 రకానికి ప్రత్యామ్నాయంగా పైన తెలిపిన రకాలను సాగుచేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ రవికుమార్ (జిల్లా వ్యవసాయ కార్యాలయం), వ్యవసాయశాఖ ఏడీఏ పి. మస్తానమ్మ, ఏవో వి.నరేంద్రబాబు, సర్పంచ్ ఇండ్లమూరి రామారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఏఎం రెడ్డి కళాశాల అధ్యాపకుడు సింహాచలంకు డాక్టరేట్



ప్రొఫెసర్ సింహాచలంను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు

పెట్లూరివారి పాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 10: స్థానిక పెట్లూరివారిపాలెంలో గల ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆర్ సింహాచలం విట్ - ఏపీ యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. అధ్యాపకులు ఆర్ సింహాచలం ఇంటిగ్రే టెడ్ అప్రోచెస్ ఫర్ పవర్ సిస్టం ఎన్‌హాన్స్‌మెంటు యూజింగ్ ఆప్టిమల్ కంట్రోల్ స్ట్రాటజీస్ అండ్ స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీస్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించి ఈ డాక్టరేట్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆర్ సింహాచలంను కళాశాల డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, అభినందించారు.

ముండ్లమూరు బస్టాండ్ సెంటర్లో అగ్నిప్రమాదం

వినుకొండటౌన్, ఆగస్టు 10: పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్లో రావిచెట్టు వెనుక బజార్లోని ఒక సిగరెట్ల హోల్‌సేల్ షాపు గోడౌన్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. షార్టు సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగిందని స్థానికులు చెడుతున్నారు. ఈ ప్రమాదంలో నష్టం భారీగా వాటిల్లిందని సమాచారం. సిగరెట్లు, అగ్గి పెట్టెల బాక్సులు, గుట్కా, ఖైనీ బస్తాలు, తదితర రకాలు అగ్నికి ఆహుతయినట్లు స్థానిలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మాచర్ల రూరల్, ఆగస్టు 10: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పాత రైలుకట్ట ప్రాంతానికి చెందిన షేక్ అహ్మద్ సలీం (42) అదే ప్రాంతంలో నూతనంగా ఇల్లు నిర్మించి రంగులు వేయిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆఇంట్లోకి వెళ్లి పిల్లర్‌కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రభాకరరావు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య మునిషాబేగం ఫిర్యాదు మేరకు సీఐ ప్రభాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

నకరికల్లు, ఆగస్టు10: ప్రభుత్వం సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి కే.దేవదాసు తెలిపారు. శనివారం మండలంలోని చీమల మర్రి గ్రామంలో రైతు సేవా కేంద్రం ద్వారా విత్తనాలను పంపిణీ చేశారు. జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నాయంగా కేఎన్ఎం 1638 రకం ఒక కిలో ధర రూ.40.50కాగా సబ్సిడీ పోగా రూ.35.50 చెల్లించాలని, ఎంటీయూ 1224 రకం ఒక కిలో పూర్తి ధర రూ.41.80 కాగా సబ్సిడీ పోగా రూ.36.80 చెల్లించాలని తెలిపారు.